GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 61 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 30-11-2024 | పేజీలు : 3

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీఎఫ్

టీ మీడియా, నవంబర్ 1, హైదరాబాద్: తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) స్వీకరించింది. ఎస్పీఎఫ్‌నకు చెందిన 214 మంది ఈ రోజు నుంచి సచివాలయం భద్రత బాధ్యతలు చేపట్టారు. గేట్లు, ఇతర ప్రాంతాల్లో సాయుధ గార్డు, లోపల గస్తీ వంటి బాధ్యతలను ఎస్పీఎఫ్‌నకు ప్రభుత్వం అప్పగించింది. ఎస్పీఎఫ్ కమాండెంట్ దేవీదాస్ నేతృత్వంలో భద్రత సిబ్బంది ఇవాళ సచివాలయం ఆవరణలో పూజలు నిర్వహించి బాధ్యతలను స్వీకరించారు. సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదట్లో ఎస్పీఎఫ్ భద్రత నిర్వహించింది. గతేడాది ఏప్రిల్ 25న భద్రత నిర్వహణను తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)కు అప్పగించారు. అయితే భద్రతతోపాటు అగ్నిప్రమాదాల నుంచి రక్షణ వంటి పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఎస్పీఎఫ్‌నకు సచివాలయం భద్రత బాధ్యతలు అప్పగించాలని ఆగస్టు 5న ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదించారు. డీజీపీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం భద్రత బాధ్యతలను టీజీఎస్పీ నుంచి తీసుకోవాలని ఎస్పీఎఫ్‌ను ఆదేశించింది.

పేదల తిరుపతి

కురుమూర్తి జాతర

-శ్రీవారి బ్రహ్మోత్సవాలు షురూ

టి మీడియా, నవంబరు 1,చిన్నచింతకుంట :తెలంగాణలో అతి పురాతన ఆలయాల్లో ఒకటిగా పేరుగాంచిన క్షేత్రం మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురం సమీపంలో వెలసిన కురుమూర్తి దేవస్థానం. కురుమూర్తి క్షేత్రం పేదల తిరుపతిగా%ొ% స్వామివారు పేదల శ్రీవారిగా ప్రఖ్యాతి. ఇక్కడి ప్రకృతి, ఆహ్లాదకరమైన వాతావరణం తిరుమల తలపిస్తుంది. ఇక్కడ కూడా శ్రీవారు ఏడు కొండలను తన ఆవాసంగా మలుచుకున్నాడు. దేవరగట్టుపైనున్న కాంచన గుహలో శ్రీ వేంకటేశ్వర స్వామి, లక్ష్మీ సమేతంగా స్వయం భువుగా కొలువుదీరి ఉన్నాడు. తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రతీరూపమే ఇక్కడి స్వామివారని భక్తుల నమ్మకం. కురుమూర్తిలో కొలువైన వేంకటేశ్వర స్వామి విగ్రహం తిరుపతి వేంకటేశ్వర స్వామి మూర్తిని పోలి ఉండటం ఇక్కడ విశేషం.



ఊరేగింపు ఉత్సవమే ప్రధాన ఘట్టం

పాలమూరు ప్రజల ఇలవేల్పు దైవం కురుమూర్తిస్వామి వారు. ఏడు కొండల మధ్య లక్ష్మి సమేతంగా వెలిసిన శ్రీ వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 2వ తేది నుంచి 18వ తేది వరకు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లానుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను ప్రతియేటా ఘనంగా నిర్వహిస్తోంది ఆలయ కమిటి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి అలంకరణ, ఉద్దాల మహోత్సవం, స్వామి వారి కళ్యాణం ప్రధాన ఘట్టాలు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారి క్షేత్ర ఆవరణ అంతా దుకాణాలు, లక్షలాది భక్తులతో ఎంతో సందడిగా మారుతుంది. ప్రధాన ఘట్టాలతో పాటు, బ్రహ్మోత్సవాలకు సుమారు 10లక్షల మంది వరకు భక్తులు హాజరవుతారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఉద్దాల(పాదుకలు) ఊరేగింపు ఉత్సవమే ప్రధాన ఘట్టం. ఈ వేడుకలో భాగంగా మొదట పల్లమర్రి నుంచి చాటను ఊరేగింపుగా వడ్డేమాన్ గ్రామం వరకు తీసుకువస్తారు. అక్కడే నియమ నిష్ఠలతో స్వామివారి పాదుకలను తయారు చేస్తారు. అక్కడి నుంచి ఊరేగింపుగా కురుమూర్తి దేవస్థానం వరకు తీసుకువస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారు. శ్రీవారి ఉద్దాలను దర్శిస్తే ఎలాంటి సమస్యలు ఉన్న తొలగిపోయి అంత మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. శ్రీ వేంకటేశ్వరస్వామి వారు ఇక్కడకు రావడా నికి రెండు రకాల పురాణగాథలు ఉన్నాయి. ఇందులో తిరుపతి నుంచి కురుమూర్తికి రా వడానికి కారణం కుబేరుని అప్పుల బాధ నుండి తప్పించుకోవడానికి. తిరుపతి నుంచి ఇక్కడి కి ఉత్తరముఖంగా వస్తున్న సమయంలో సుగంధభరిత నానాఫల పక్షాలతో కనబడిన గుట్టపై కాసేపు విశ్రమిద్దామనే లక్ష్మీదేవి కోరిక మేరకు స్వామి ఇక్కడ ఆగినట్టు పురాణ గాథ. దాదాపు 900 సంవత్సరాల నుండి స్వామి వారు పూజలు అందుకున్నట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. ప్రతి ఏడు కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు తరలిరానున్నారు. నెల రోజుల పాటు స్వామివారి జాతర కన్నుల పండువగా సాగుతుంది. దీంతో వచ్చే భక్తుల ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



ఇప్పటికే యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు ఆలయ కమిటీ, జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. భద్రత కోసం పోలీస్ కంట్రోల్ రూం నుంచి సీసీ కెమరాలతో పర్యవేక్షించనున్నారు. 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు కాల క్షేపంతో పాటు, వారిని చైతన్య పరిచేందుకు కళాజాతాలు, నాటక ప్రదర్శనలు, సంగీత విభావరులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా కురుమూర్తి స్వామి వారు నిలుస్తున్నారు. కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో భక్తులు తరలివచ్చి స్వామివారికి దాసంగం సమర్పిస్తారు. కొత్తకుండలో తొలిపంట ధాన్యంతో నైవేద్యం పెడతారు. అనంతరం అక్కడే ఆ రాత్రి బస చేసి ఆధ్యాత్మిక చింతనలో గడుపుతారు. పాలమూరు జిల్లాలోని కొండలలో నెలకొన్న కురుమూర్తి స్వామి వారి బ్రహ్మోత్సవాలకు గతేడాది అసెంబ్లీ ఎన్నికలు ఆటంకం కలిగించాయి. దీంతో ఈసారి అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు భావిస్తున్నారు.శ్రీ కురుమూర్తి స్వామి జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోంది %బ+హ=జ% . జాతరలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవం ఈ నెల 8వ తేదిన ఉండగా.. 7 నుంచి 9వ తేది వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా రోజుల్లో ప్రత్యేక బస్సులను హైదరాబాద్ నుంచి సంస్థ అందుబాటులో ఉంచుతోంది. ఎంజీబీఎస్ నుంచి ఆరాంఘర్, మహబూబ్‌నగర్ మీదుగా జాతరకు వెళ్తాయి. ఈ స్పెషల్ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంది. టికెట్ల బుకింగ్ కోసం tgsrtcbus.in వెబ్ సైట్‌ను సంప్రదించగలరు. ఈ ప్రత్యేక బస్సులను ఉపయోగించుకుని సురక్షితంగా శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకోవాలని టీజీఎస్ఆర్టీసీ కోరుతోంది.

అవగాహన నోచుకోని

నిర్మాణ కార్మికులు

-కల్పించని కార్మిక శాఖ

-కార్యాలయానికి బోర్డు కరువు

టీ మీడియా, నవంబర్ 1, వనపర్తి బ్యూరో : వనపర్తి జిల్లాలో దాదాపు లక్షకు పైగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు సరేనా అవగాహన లేకపోవడం వలన కార్మిక సంక్షేమ శాఖ నుంచి అందవలసిన సంక్షేమ ఫలాలు కార్మికులకు అందడం లేదు. అవగాహన కల్పించవలసిన కార్మిక శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గతంలో కార్మిక శాఖ కార్యాలయం గాంధీచౌక్ అక్కడి నుంచి అంబేద్కర్ చౌరస్తా అనంతరం మర్రికుంట దగ్గర ఉన్న కలెక్టర్ కార్యాలయంలోని 214 రూమ్ నెంబర్ లో కార్మిక శాఖ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడికి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు పైగా అవుతున్న కార్మిక శాఖ అధికారులు ఇంతవరకు కార్యాలయానికి కార్యాలయ బోర్డు, సమాచార హక్కు చట్టం బోర్డును కూడా ఏర్పాటు చేయలేదు. విధులు నిర్వహించడంలో కార్మిక శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు అని కార్యాలయానికి వచ్చి పోయే కార్మికులు వాపోతున్నారు. ఒక ఇంటిని ఎంత చక్కగా నిర్మించిన, వారి జీవితాలు మాత్రం చీకటిగానే మిగులుతున్నాయి. వారికుండే సంక్షేమ ఫలాలు కూడా వారికి తెలియకుండా పోతున్నాయి.భవన నిర్మాణ రంగంలో ఒక ఇంటిని నిర్మించడానికి పార పనివారు, మేస్త్రిలు, ఎలక్ట్రిషన్, కార్పెంటర్ , ప్లంబర్, పెయింటర్ , టైల్స్, గ్రానైట్ వర్కర్లు తదితరులు పని చేస్తూ ఉంటారు . కానీ వారిలో 50% మంది కూడా అవగాహన లోపంతో లేబర్ కార్డు తీసుకోలేదు. ప్రభుత్వ అధికారులు వివిధ సంఘాల నాయకులు కార్మికులకు అవగాహన కల్పించి లేబర్ కార్డులు తీసుకునే విధంగా ప్రోత్సహించాలని కార్మికులు ప్రాధేయపడుతున్నారు. భవన, ఇతర నిర్మాణ రంగములలో పనిచేయు కార్మికుల సంక్షేమమునకై 1996 సం.లో చట్టం చేతబడినది.ఈ చట్ట పరిధిలో లబ్ధిదారులుగా నమోదుకాబడిన ప్రతి లబ్దిదారునికి చట్టరీత్యా ఏర్పాటు చేయబడిన సంక్షేమ మండలి ద్వారా లబ్ది చేకూరును. లబ్దిదారులుగా నమోదు చేసుకొనుటకు కావలసిన అర్హతలు భవన నిర్మాణ కార్మికుడై / కార్మికురాలై వుండవలెను.18 సం?ముల నుండి 60 సం?ముల లోపు వయస్సు కలిగిన వారు మాత్రమే అర్హులు.నమోదు చేయగోరు దినమునకు ముందు గల 12 నెలలలో 90 రోజులకు తక్కువ కాకుండా భవన , ఇతర నిర్మాణ రంగములలో పనిచేసి వుండాలి .



నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణ :

కార్మికుల ఆరోగ్యం, భద్రత నైపుణ్యం పెంచుకోవడానికి నిర్మాణ శిక్షణా సంస్థలద్వారా కార్మికులకు శిక్షణ. ఆధారితులకు వివిధ వృత్తులలో శిక్షణ: కార్మికుని/ కార్మికురాలిపై ఆధారపడిన జీవితభాగస్వామికి వారి యుక్త వయస్సులో ఉన్న పిల్లలకు వివిధ వృత్తులలో శిక్షణ.పనిలో ఉండగా ప్రమాదవశాత్తు మరణించినచో అతని కుటుంబ సభ్యులకు రూ? 50,000/- పనిలో ఉండగా ప్రమాదములో 50% కన్నా ఎక్కువ అంగవైకల్యము కలిగిన వారికి , పనిలో ఉండగా ప్రమాదములో 50% కన్నా తక్కువ అంగవైకల్యము కలిగిన వారికి కూడా సహాయం అందించబడును. కావున భవన నిర్మాణ రంగంలో చేసే ప్రతి కార్మికుడు లేబర్ కార్డు తీసుకొని ప్రభుత్వం కార్మిక శాఖ నుండి అందించే సంక్షేమ ఫలాలు పొందాలి.

హైదరాబాద్ - విజయవాడ హైవే

- **ఆరు లైన్లుగా విస్తరణ**
- **కేంద్రం కీలక నిర్ణయం**

టి మీడియా, నవంబరు 1,ఢిల్లీ: దేశంలోనే అత్యంత వాహనాల రద్దీ కలిగిన ఈ హైవేపై ప్రమాదాలతో నిత్యం రక్తసిక్తమవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై 17బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు.తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే హైదరాబాద్ - విజయవాడ హైవేపై వెళ్లే ప్రయాణికులకు గుడ్ న్యూస్. ఎంతో కీలకమైన ఈ జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరణకు మోక్షం కలిగింది. దేశంలోనే అత్యంత వాహనాల రద్దీ కలిగిన హైదరాబాద్ - విజయవాడ హైవేపై నిత్యం రక్తసిక్తమవుతోంది. ఈ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు హైవేను ఆరు లైన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.తెలంగాణ ఏపీ రాష్ట్రాలకు జాతీయ రహదారి నెంబర్ హైవే 65 కీలకమైనది. హైదరాబాద్ నుంచి విజయవాడ మధ్య యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకూ ఉన్న 181.50 కిలోమీటర్లు ఉంది. ఈ హైవేను ఆరు లైన్లుగా విస్తరించేందుకు 2010లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా , జీఎమ్మార్ సంస్థకు బాధ్యతలు అప్పజెప్పింది. కానీ 181.50 కిలోమీటర్ల రోడ్డును రూ.1740 కోట్లతో నాలుగు లైన్లుగా విస్తరించింది. ఆ సమయంలోనే ఆరు లేన్ల రహదారి కోసం భూసేకరణ చేశారు. 2012లో జీఎమ్మార్.. పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్ ప్లాజాల ద్వారా టోల్ వసూలు చేస్తోంది. ఇలా 2025 జూన్ వరకూ టోల్ వసూలు చేసుకునేందుకు జీఎమ్మార్ కు గడువు ఉంది. నిత్యం ప్రమాదాలతో ఈ హైవే రక్తసిక్తంగా మారుతుండడంతో ఆరు లైన్లుగా విస్తరించాలనే ప్రతిపాదన వచ్చింది. ఈ హైవేని ఎట్టకేలకు ఆరులేన్ల రహదారిగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. రెండేండ్లలోగా ఈ హైవే ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులను పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

17బ్లాక్ స్పాట్‌లలో నిత్యం ప్రమాదాలు..

దేశంలోనే అత్యంత వాహనాల రద్దీ కలిగిన ఈ హైవేపై ప్రమాదాలతో నిత్యం రక్తసిక్తమవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై 17బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూరు, ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఈనాడు జంక్షన్, జనగాం ఎక్స్‌రోడ్డు, పిల్లలమర్రి ఎక్స్‌రోడ్డు, దురాజ్‌పల్లి, ముకుందా పురం, ఆకుపాముల, కొమరంబండ, కట్టకొమ్ముగూడెం, మేళ్ళచెర్వు ఎక్స్‌రోడ్డు, మునగాల ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఫ్లైఓవర్లు లేకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 569 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 56 మంది మృతి చెందారు. ఈ కిల్లర్ రోడ్డుపై వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో సగటున రోజుకు రెండు ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవ..

ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదిగా వెళుతున్న 65ను ఆరు లైన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవ తీసుకున్నారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని ఒప్పించి ఆరు లైన్ల విస్తరణకు నిధులు తెప్పించారు. మరోవైపు ఈ హైవేపై ఉన్న 17 బ్లాక్ స్పాట్స్ వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దిద్దుబాటు పనులకు ఇప్పటికే కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్ల నిర్మాణం, సైన్ బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. బ్లాక్ స్పాట్స్ దిద్దుబాటు పనులను రామ్ కుమార్ సంస్థ చేపడుతోంది. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి ఆరు లైన్ల విస్తరణతోనైనా ప్రమాదాలకు చెక్ పడుతుందని జిల్లా వాసులు భావిస్తున్నారు.

దీపం 2.0 పథకానికి శ్రీకారం..

-స్వయంగా టీ కాచిన సీఎం చంద్రబాబు

టీ మీడియా, నవంబర్ 1, శ్రీకాకుళం:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపం 2.0 పథకాన్ని ప్రారంభించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో పర్యటించిన సీఎం చంద్రబాబు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారు. శాంతమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లి గ్యాస్ సిలిండర్ పంపిణీ చేశారు. అనంతరం స్వయంగా గ్యాస్ వెలిగించి టీ పెట్టారు సీఎం చంద్రబాబు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యుల సంఖ్య, ఎంత మందికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు. తర్వాత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి టీ తాగారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు అదే వీధిలో మరో ఒంటరి మహిళకు పెన్షన్ పంపిణీ చేశారు.అంతకు ముందు.. శ్రీకాకుళం జిల్లాకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బస్సులో టీడీపీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

బీసీ కమిషన్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

టీ మీడియా, నవంబర్ 1, వనపర్తి బ్యూరో : నవంబర్ 8న మహబూబ్ నగర్ జిల్లా ఐ.డి.ఒ.సిలో బీసీ కమిషన్ ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఫిర్యాదుల స్వీకరణ ఉంటుంది అని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధి, సామాజిక రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ నేతృత్వంలో నవంబర్ 8వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం కానున్నట్లు జిల్లా కలెక్టర్ నెడొక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా (మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల) జిల్లా ప్రజలు బి.సి. కమీషన్ చైర్మన్, బృందం సభ్యులకు నమోదిత లేదా నమోదు కానీ అసోషియేషన్లు, సంఘాల ప్రతినిధులు వారికి అవసరమైన రిజర్వేషన్ దామాషాను, వాదనలను, ఆక్షేపణలు లేదా సలహాలు, అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. బి.సి లకు స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లు, దామాశాను క్షేత్రస్థాయిలో ఆయా సంఘాల నుండి స్వయంగా తెలుసుకునేందుకు బి.సి కమిషన్ బృందం అక్టోబర్, 28 నుండి నవంబర్ 13 వరకు రాష్ట్రంలోని ఆయా ఉమ్మడి జిల్లాలలో పర్యటించి సమాచారం సేకరిస్తుందనీ అందులో భాగంగా నవంబర్ 8న మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలోని వివిధ సామాజిక వర్గాల వారు, ప్రజా ప్రతినిధులు, ఆసక్తికలవారు తమ అభిప్రాయాలను వ్రాత పూర్వకముగా బి.సి. కమీషన్ బృందానికి అందజేయవచ్చును. అభ్యర్థనతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన పార్మాట్ ను పూరించి (6) సెట్లను మహబూబ్ నగర్ కలెక్టరేట్ లో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు తమ తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాల కొరకు http://www.telangana.gov.in వెబ్ సైట్ ను శోధించవచ్చు అని తెలిపారు.

28, 29న సీపీఐ(ఎం) 13వ మహాసభలు

- రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

టీ మీడియా, నవంబర్ 1,ఆదిలాబాద్ :ఆదిలాబాద్ జిల్లా సీపీఐ(ఎం) 13వ మహాసభలను నవంబర్ 28, 29 తేదీలలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి దాతలు శ్రేయోభిలాషులు ఆర్థిక, హార్దిక సహాయ, సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్ లో పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ మాట్లాడుతూ.. జిల్లా మహాసభలు ఈ నెల 28, 29న పట్టణంలో జరుగనున్నట్లు స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) పార్టీ తన శక్తిమేరకు ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడిందని, పోరాడుతుందని అన్నారు. జిల్లాను అభివృద్ధి చేయడం కోసం వామపక్ష ప్రజాస్వామిక శక్తులను ఏకం చేసి ఐక్య పోరాటలు చేసిందని గుర్తు చేశారు. ప్రధానంగా సీపీఐ(ఎం) సిమెంటు ఫ్యాక్టరీ గురించి, ఏరోడ్రమ్, ఆర్మూర్ రైల్వే లైన్, రైతుల సమస్యల పట్ల అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. పలు సమస్యల పరిష్కారానికి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి.. పరిష్కరినికి పోరాటాలు చేశామన్నారు. భవిష్యత్తులో జిల్లా సమగ్రభివృద్ధికోసం ఐక్య పోరాటాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. మహాసభల్లో ఇందుకోసం తీర్మాణాలు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆత్రం కిష్టన్న, బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, ఆర్.సురేంద్రర్, మంజుల పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి..

-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..

- పలు మండలాల్లో ఆకస్మికంగా తనిఖీ..

టీ మీడియా, నవంబర్ 1,వేములవాడ :హౌస్ లిస్టింగ్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మొదలుకాగా, బోయినపల్లి మండల కేంద్రములోని 11 వ వార్డు, అలాగే వేములవాడ అర్బన్ మండలం మారుపాక, వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లిలో చేపట్టిన సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్యుమారేటర్ బ్లాక్ లోని ఐదు ఇండ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న విధానంపై అధికారాలను ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా తేదీ 01.11.2024 నుండి 03.11.2024 వరకు హౌస్ లిస్టింగ్ సేకరిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు జయశీల, రాజీవ్ మల్హోత్రా, ఎంపీఓ శ్రీధర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు జాగిలాలతో తనిఖీలు

టీ మీడియా ,నవంబర్ 1 ,ఆత్మకూరు :ఆత్మకూరు పట్టణంలోని బస్టాండ్ ప్రభుత్వ ఆసుపత్రి గాంధీ చౌరస్తా, కాలేజీలు కూరగాయల మార్కెట్ మొదలగు ప్రాంతాలలో పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు ముఖ్య ఉద్దేశం మాదక ద్రవ్యాలు పరిశీలన, పేలుడు పదార్థాల పసిగట్టడం వాటి కొరకు జాగిలాలతో తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆత్మకూరు ఎస్బిఐ బ్యాంకు లో గల కురుమూర్తి స్వామివారి ఆభరణాలు ఊరేగింపు,పోలీసు బందోబస్తు జాతరకు తీసుకుపోయే ఆభరణాల బందోబస్తు ఏర్పాట్లను, బ్యాంకు పరిసరాలను వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ బందోబస్తు సంబంధించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సిఐ శివకుమార్, ఆత్మకూరు ఎస్సై నరేందర్, అమర్ చింత ఎస్సై సురేష్, మదనా పురం ఎస్ఐ శేఖర్ రెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో రూ.7కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్

టి మీడియా, నవంబరు 1,శంషాబాద్: లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం పెద్ద ఎత్తున డ్రగ్స్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు ప్రయాణికుల వద్ద నుంచి రూ.7కోట్ల విలువైన డ్రగ్స్‌ను పట్టుకొని.. వారిని అరెస్టు చేశారు. డ్రగ్స్ రవాణాపై డీఐఆర్ అధికారులకు ఇంటిలిజెన్స్ వర్గాలు సమాచారం అందించాయి. ఈ మేరకు అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బ్యాంకాక్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన విమానంలో ఇద్దరు ప్రయాణికులపై అనుమానం వచ్చింది. ఈ మేరకు అధికారులు లగేజీని తనిఖీ చేశారు. ఇందులో హైడ్రోపోనిక్స్ డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. 13 ప్యాకెట్లలో 7.096 కిలోల బరువున్న డ్రగ్స్‌ని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ఎన్‌పీడీస్ చట్టం కింద కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు అధికారులు తెలిపారు. హైడ్రోపోనిక్స్ గంజాయి కంటే ప్రమాదకరమైందని.. డ్రగ్స్ కంటే విలువైందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రపంచంలోనే కొద్ది దేశాల్లో దొరుకుతుందని చెప్పారు.

చికిత్స కోసం ఎల్వోసి

-అందజేసిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

టీ మీడియా, నవంబర్ 1, వనపర్తి బ్యూరో : వనపర్తి టౌన్ ఆరో వార్డు గొడుగు సాయిలీల అనారోగ్య బాధపడుతున్న తెలుసుకున్న జిల్లేల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వెంటనే స్పందించి సంబంధించిన చికిత్స కోసం బాధిత కుటుంబానికి భర్త గొడుగు నరసింహకు వనపర్తిలో డాక్టర్ చిన్నారెడ్డి నివాసంలో 150000/- రూపాయల ఎల్వోసి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డికి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కమర్ రాష్ట్ర మైనార్టీ నాయకులు, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు నందిమల్ల యాదయ్య, గోకం బాలరాజు, సుగురు చేన్నయ్య, రంగం నాగన్న, పుల్యా నాయక్, కృష్ణ నాయక్, కనిమేట రాములు, రంగం కురుమూర్తి, జజల శాంతయ్య, కళ్యాణ్ నాయక్, పిఆర్ఓ భాస్కర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగింది.

సమస్యలు పరిష్కరించండి..

-నేషనల్ హైవేపై బైఠాయించిన విద్యార్థులు

టి మీడియా, నవంబరు 1,రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా బాటసింగారంలో బీసీ గురుకుల విద్యార్థులు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బైఠాయించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహిస్తున్నారు. ఆహారం సరిగా పనిచేయడం లేదని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని నిరసన వ్యక్తం చేస్తున్నారు. చదువు సరిగా లేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. దీంతో నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జాం అయింది. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యార్థులకు సర్దిచెబుతున్నారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

టీ మీడియా ,నవంబర్ 1 ,ఆత్మకూరు:మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు మక్తల్,నర్వ ఆత్మకూరు,అమర్ చింత మండలాలలో కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా చేశారు. నర్వ మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలుబ్రెడ్ లు పంచగా, అమరచింత మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. ఆత్మకూరు మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్లు పంచగా కొందరు కాంగ్రెస్ కర్తలు సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు తులసిరాజ్ రెహమతుల్లా,వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి గంగాధర్ గౌడ్ అక్షర స్కూల్ అధినేత నాగేశ్వర్,మనీ వర్ధన్ రెడ్డి, కుర్షిద్, షబ్బీర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

సీఎం రేవంత్ రెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక

టీ మీడియా, నవంబర్ 1,చిన్నచింతకుంట :మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలంలో అమ్మాపురం సమీపంలో వెలసిన కాంచన గుహలో వెలసిన కురుమూర్తి రాయుని బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కురుమూర్తి జాతర ఆహ్వాన పత్రికను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లు కలిసి కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్, ఈవో, అర్చక బృందం టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు

కబడ్డీ జట్టుకు ట్రాక్ షూట్

-అందజేసిన మాజీ శాట్ చైర్మన్

టీ మీడియా ,నవంబర్ 1, చిన్నచింతకుంట: ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎస్ జి ఎఫ్ అండర్ 19 బాలుర కబడ్డీ జట్టుకు చిన్నచింతకుంట మండలంలోని అల్లిపూర్ గ్రామంలో గల ఇందిరమ్మ ఇండోర్ మినీ స్టేడియంలో వారం రోజులపాటుగా రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కబడ్డీ జట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ తెలంగాణ రాష్ట్ర శాట్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కబడ్డీ క్రీడాకారులకు పరిచయం చేసుకొని ఇందిరమ్మ మినిస్ట్రీడియంలో శిక్షణ శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని భవిష్యత్తులో మరెన్నో క్యాంపులను క్రీడలను ఇక్కడ నిర్వహించేలా చూడాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కబడ్డీ కోచ్ మల్లేష్, జి నరేష్, గ్రామ సర్పంచ్ రఘు వర్ధన్ గౌడ్, మహేందర్ రెడ్డి సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు

వాట్సప్ అడ్మిన్ లు బాధ్యతగా వ్యవహరించాలి

- డిఎస్పీ జీవన్ రెడ్డి

- దుష్ప్రచారం చేసిన వారిపై చర్యలు

టీ మీడియా, నవంబర్ 1,ఆదిలాబాద్ :సోషల్ మీడియాలో, వాట్సప్ గ్రూప్ అడ్మిన్లు దుష్ప్రచారాలపై బాధ్యతతో వ్యవహరించాలని డీఎస్పీ జీవన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీచౌక్ ప్రదేశంలో గత రాత్రి గొడవ జరిగినట్టుగా కొన్ని వాట్స్‌అప్ గ్రూపులలో గతంలో జరిగిన వీడియోలను ప్రస్తుతం జరిగినట్లు దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాల క్రిందట జరిగిన సంఘటన వీడియోలను ప్రస్తుతం వాట్సాప్ గ్రూపులలో సర్కులేట్ చేస్తున్న వారిపై, పోస్టులు చేసిన వారిపై, గ్రూపుల అడ్మిన్లు తొలగించకపోయిన జిల్లా పోలీస్ సోషల్ మీడియా యంత్రాంగం గమనిస్తూ చట్టపరమైన చర్యలను తీసుకుంటుందని పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపు అడ్మిన్లు అప్రమత్తతో వ్యవహరిస్తూ ఇలాంటి దుష్ప్రచారాలు ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా ఉండాలని ఒకవేళ గ్రూపులో వచ్చినట్లయితే వాటిని వెంటనే తీసివేయాలని పేర్కొన్నారు. కావాలని ఎవరైనా ప్రశాంత వాతావరణ చెడగొట్టాలని ప్రయత్నం చేసినచో, రెచ్చగొట్టేలా వ్యవహరించిన, ఇలాంటి వీడియోలని ఫార్వర్డ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేటట్లు బందోబస్తు ప్రక్రియను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

టీ మీడియా, నవంబర్ 1,తంగళ్ళపల్లి:రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వారి ధాన్యం శుక్రవారం అకాల వర్షం పడడంతో ధాన్యం తడిసి ముద్దయింది. తంగళ్ళపల్లి మండలంలోని జిల్లెల్లా గ్రామం లో రైతులు ఆరబోసిన ధాన్యం కురిసిన అకాల వర్షానికి తడిసి, వర్షం నీటితో ధాన్యం కొట్టుకుపోయింది. దాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఇంకా తూకం వేయకపోవడంతో చాలావరకు ధాన్యం కుప్పలు పోయడంతో అకాల వర్షానికి ధాన్యం మొత్తం తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని తూకం వేయాలని రైతులు వేడుకుంటున్నారు.

కాపర్ వైర్ దొంగలు అరెస్ట్..

టీ మీడియా, నవంబర్ 1,జమ్మికుంట:జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గా కాలనీలో ఉన్న రైల్వే శాఖకు చెందిన ఒక ప్రైవేటు కాంట్రాక్టర్ గోదాంలో నిల్వ ఉంచిన సుమారు నాలుగున్నర లక్షల విలువ చేసే కాపర్ వైర్ ను నవంబర్ 29వ తేదీన గోదాం సెట్టర్ తాళాలు పగల కొట్టి కాపర్ సుమారు 500 కేజీల వైరును దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను జమ్మికుంట పోలీసులు చాకచక్యంగా 48 గంటల్లో పట్టుకోవడం జరిగిందని సిఐ తెలిపారు. బండావతి సందీప్ అనే వ్యక్తి మరో వ్యక్తి బాలుతో కలిసి నవంబర్ 29న సుమారు రూ.5 లక్షల విలువచేసే కాపరు వైరును దొంగతనం చేసి కీసర మండలం నాగారం గ్రామానికి చెందిన హేమ కనకయ్య అనే వ్యక్తికి విక్రయించారు. కనుకయ్యను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నల్గొండ జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన బాలును త్వరలో పట్టుకుంటామని చెప్పారు. దొంగతనం జరిగినట్లు గోడౌన్ ఇంచార్జ్ జగదీష్ దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి సీసీ కెమెరాలు ఆధారంగా దర్యాప్తు చేసి దొంగలను పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను చాకచక్యంగా పట్టుకొని కేసును చేదించిన జమ్మికుంట పట్టణ ఎస్ఐ ఆరోగ్యం ,హెడ్ కానిస్టేబుల్ మోహన్, సదయ్య, సంపత్ లతోపాటు కానిస్టేబుల్ వేణు మిగతా సిబ్బందిని సిఐ అభినందించారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళులు

టీ మీడియా, నవంబర్ 1, దుబ్బాక: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్, మండలాధ్యక్షులు ఏసురెడ్డి, కొంగర రవి, ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఆకుల భరత్, మంద శ్రీనివాస్, మచ్చ శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి పలువురున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం.

టీ మీడియా నవంబర్ 1 చిన్నంబావి:చిన్నంబావి మండలం గడ్డ బస్వాపూర్ గ్రామానికి చెందిన నాగపూర్ లచ్చమ్మ, ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, గ్రామ నాయకుల ద్వారా ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం పంపించి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సరోజినీ దవాఖానకు క్యూ కట్టిన జనం

-దీపావళి టపాసులు కారణం..?

టి మీడియా, నవంబరు 1, హైదరాబాద్ :సరోజినీ దేవి హాస్పిటల్‌కు పేషంట్స్ క్యూ కట్టారు. నగరంలో జరిగిన దీపావళి వేడుకల్లో పలు ప్రాంతాల నుంచి దాదాపు 50 మంది పేషెంట్లు గాయలతో సరోజినీ దేవి ఆసుపత్రికి వచ్చారు. పటాకులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోమని వైద్యులు ఎంత హెచ్చరిస్తున్న బాధితుల సంఖ్య తగ్గడం లేదు. దీపావళి పండుగ సందర్భంగా ప్రతి ఏడాది సరోజినీ దేవి హాస్పిటల్‌కు వచ్చే పేషెంట్ల వారి సంఖ్య అధికంగా ఉంటుంది. బాణాసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్న నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గాయాల పాలవుతున్నట్లు వైద్యులు తెలిపారు. 34 మందికి స్వల్ప గాయాలైనట్లు, 9 మందికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేరినట్లు తెలుస్తుంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది బాధితుల సంఖ్య కొద్దిగా తగ్గిందని వైద్యులు చెబుతున్నారు.

పెన్షన్ల పంపిణీలో సర్వర్ ప్రాబ్లం

టి మీడియా, నవంబరు 1, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా నేడు పెన్షన్లు పంపిణీ కావల్సి ఉండగా, సాంకేతిక లోపం తలెత్తింది. సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడంతో పింఛన్ల కోసం లబ్దిదారులంతా పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ లోపంపై అధికారులు ఆరా తీస్తున్నారు. కొన్నిచోట్ల అధికారులు గంటన్నర సేపు ప్రయాస పడి సర్వర్ లోపాన్ని తొలగించి పెన్షన్లు తిరిగి పంపిణీ చేస్తున్నారు. మరోవైపు ఎన్టీఆర్ జిల్లాలోనూ.. సర్వర్ స్లో అవడంతో పింఛన్ల పంపిణీకి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. పింఛన్లు పంపిణీ చేసే ఉద్యోగి లాగిన్ అవ్వాలన్నా పింఛను పొందే వ్యక్తి వేలిముద్ర వేయాలన్నా సర్వర్ పని చేస్తేనే పంపిణీ జరుగుతుంది. ఉదయం 6 గంటల నుంచి ఏడు గంటల వరకూ 200 పైగా పింఛన్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకూ మూడు లేదా నాలుగు పింఛన్లు మాత్రమే పంపిణీ చేయడం జరిగింది.

కాళేశ్వరం విచారణ కమిషన్

-గడువు మరోసారి పొడిగింపు ?

టి మీడియా, నవంబరు 1, కాళేశ్వరం: జ్యుడీషియల్ కమిషన్ గడువును మరో రెండు నెలలు పొడిగించే అవకాశం ఉంది. గురువారంతో కమిషన్ గడువు తీరిన నేపథ్యంలో %ా% మరోసారి గడువును పొడిగించనున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను తేల్చేందుకు ఈ ఏడాది మార్చిలో సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీసీ ఘోష్ ను చైర్మన్ గా ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. అయితే విచారణ పూర్తి కాకపోవడం, ఇంకా కొందరు ఐఏఎస్ అధికారులను విచారించాల్సి ఉండడం, కాంట్రాక్ట్ ఏజెన్సీలు, సబ్ కాంట్రాక్ట్ సంస్థలూ విచారణకు రావాల్సి ఉండడంతో మరోసారి గడువు పొడిగించాల్సిన అవసరం ఏర్పడింది. విచారణ గడువును పొడిగించాలని కమిషన్ నుంచి ప్రభుత్వానికి ఇప్పటికే ఫైల్ పంపినట్టు అధికార వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో కమిషన్ గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల తొలి వారంలో దానికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసే అవకాశం ఉంది.

నాగార్జునసాగర్‌లో స్టార్ హోటల్ నిర్మిస్తాం

-మంత్రి జూపల్లి కృష్ణారావు

టి మీడియా, నవంబరు 1, నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్, బుద్ధవనం పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో స్టార్ హోటల్ నిర్మాణంతో పాటు, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం అయన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం పరిసర ప్రాంతాలను శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలేష్ డి.పాటిల్ (దాజి)తో కలిసి పరిశీలించారు. ముందుగా విజయ విహార్‌లో బుద్ధవనం లే-అవుట్, విజయ విహార్ లేఔట్లను పరిశీలించారు. మొత్తం 270 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బుధవనంలో ఉన్న విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నాగార్జునసాగర్, బుద్ధవనానికి ఆసియా ఖండంలోని పలు దేశాల నుంచి బౌద్ధులు ఇక్కడికి వస్తారన్నారు. ప్రత్యేకించి శ్రీలంక, ఇతర ఆసియా ఖండాల నుంచి ఎక్కువ మంది వస్తారని, వారికి అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఇందుకోసం నిర్మాణాలు చేపడుతామన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలు సమర్పించాలని ఈ సందర్భంగా మంత్రి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను ఆదేశించారు.

తిరుమలలో దళారీల దందా కు కళ్లెం

-వ్యవస్థకు మంగళం పడేలా చర్యలు

-టీటీడీ విజిలెన్స్ వింగ్, పోలీసు శాఖ పటిష్ట నిఘా

టీ మీడియా, నవంబర్ 1, తిరుమల: శ్రీవారి దర్శనం కోసం ఒక్కొక్కరిది ఒక్కో ప్రయాస. ఎలాగైనా తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలన్న ఆత్రుత. సామాన్యుడి నుంచి సంపన్నుడి దాకా వెంకన్న దర్శనం కోసం చేసే ప్రయత్నం కొందరు దళారులకు వ్యాపారంగా మారింది. ఇందులో భాగంగానే సిఫారసు లేఖలకు గిరాకీ నెలకొంది. ఆన్లైన్, ఆఫ్లైన్ లో శ్రీవారి దర్శనం టికెట్లు లభించని కొందరు భక్తులు, సిఫారసు లేఖలు దక్కని మరికొందరు అవసరమే ఆసరాగా తిరుమలలో దళారీల దందా కొనసాగుతోంది. కొండపై దళారు వ్యవస్థకు మంగళం పడేలా ఎన్నో చర్యలు చేపట్టిన టిటిడి పటిష్ట నిఘా కొనసాగిస్తోంది. అయినా ఏదో ఒకలా దళారీల దందా కంటిన్యూ అవుతూనే ఉంది. ఇందులో భాగంగానే వీఐపీల సిఫారసు లేఖలు దళారీలకు ఆదాయ వనరుగా మారిపోయింది. ప్రజా ప్రతినిధులకు, ప్రముఖులకు పీఆర్వోలు, పీఏలుగా వ్యవహరిస్తున్న కొందరు దళారీలతో చేతులు కలిపి వెంకన్న దర్శనంలో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇలా అడ్డంగా దొరికిపోతున్నారు. ఇలా శ్రీవారి దర్శనం కోసం దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు దర్శనం టికెట్లు, వసతి గదులు అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక తిరుమల ప్రక్షాళన పై దృష్టి సారించడంతో తిరుమలలో దళారీల దందా కు

కళ్లెం వేసేలా నిఘా పెరిగింది. టీటీడీ విజిలెన్స్ వింగ్, పోలీసు శాఖ సంయుక్తంగా దృష్టి సారించి దళారీలను ఏరి వేసే పని ప్రారంభమైంది. సి ఆర్ ఓ ఆఫీస్, జేఈవో కార్యాలయం, ఎంబీసీ 34, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ల వద్ద నిఘా పెరిగింది. అనుమానితులను అదుపులోకి తీసుకొని కూపీ లాగుతున్న విజిలెన్స్ వింగ్ దళారీ వ్యవస్థలో అసలు సూత్రధారుల పాత్రలను బయటపెడుతోంది. గత ఐదేళ్లుగా తిరుమలలో కొనసాగిన దళారీల దందాపై నమోదైన కేసులను పరిశీలిస్తోంది. 2019లో 50, 2020లో 34, 2021లో 46, 2022 లో 72, 2023లో 57, 2024లో ఇప్పటిదాకా 38 కేసులు నమోదయినట్లు టీటీడీ విజిలెన్స్ విభాగం లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 4నెలల్లో 18 కేసులు నమోదు కాగా దళారులు, ఇతర మోసగాళ్ళ మోసాలపై 64 వరకు ఫిర్యాదులు విజిలెన్స్ కు వచ్చాయి. ఈ మధ్యనే వైసీపీ ఎమ్మెల్సీ పిఏ వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను రూ. 65 వేలకు విక్రయించినట్లు తిరుమల వన్ టౌన్ పిఎస్ లో కేసు నమోదు అయింది. పుదుచ్చేరి సీఎం కార్యాలయం నుంచి సిఫారసు లేఖను పొందిన దళారీ విఐపి బ్రేక్ దర్శనం టికెట్లను విక్రయించి అడ్డంగా దొరికిపోయాడు. ఇక తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం అతిథి గృహాల్లోనూ దళారీల దందా కొనసాగుతున్నట్లు విజినెస్ గుర్తించింది. లాకర్లు తీసుకునే భక్తులను బురిడీ కొట్టించిన ఆన్ లైన్ మోసగాడి వ్యవహారం కూడా వెలుగు చూసింది. ఆదార్ తో శ్రీవారి దర్శనం గదులను తరచూ తీసుకునే వారిని గుర్తించేందుకు టీటీడీ ఆధార్ సీడింగ్ ను కూడా ప్రారంభించబోతుంది. ఈ మేరకు అనుమతులు తీసుకున్న టిటిడి, రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగానే పూర్తిస్థాయిలో ఆధార్ డేటాతో దళారులను గుర్తించే పని చేపట్టనుంది. దళారీలను ఏరివేసేందుకు టెక్నాలజీని కూడా అందుబాటులోకి టీటీడీ తీసుకురాబోతోంది. దళారులను గుర్తించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 18004254141 ను కూడా అందుబాటులోకి తెచ్చింది టీటీడీ విజిలెన్స్.

ఒక్కొక్కరిది ఒక్కో వాదన

ఇక విఐపి సిఫారసు లేఖలే దళారీల దందా కు ఆదాయ వనరుగా మారిపోగా మరోవైపు సిఫారసు లేఖలపై ఒక్కొక్కరిది ఒక్కో వాదనగా మారిపోయింది. తెలంగాణ నుంచి వచ్చే విఐపి సిఫారసు లేఖలను అనుమతించని టీటీడీ వైఖరి పై ఆ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల డిమాండ్ ఇప్పుడు చర్చగా మారింది. తెలంగాణ ప్రజా ప్రతినిధులు స్వయంగా వస్తే దర్శనం అవకాశం కల్పిస్తున్న టీటీడీ సిఫారసు చేస్తే అనుమతించని పరిస్థితి ఉంది. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నేతలందరూ టీటీడీ తమ సిఫారసులను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిడి వస్తోంది.

తెలంగాణ నేతల అభ్యర్థనపై..

ఇలా సిఫారసు లేఖల వ్యవహారంపై తెలంగాణ ప్రజా ప్రతినిధుల వార్నింగ్ ను పట్టించుకోని టీటీడీ ఇప్పటిదాకా దీనిపై ఏ నిర్ణయము తీసుకోలేదు. అయితే సిఫారసు లేఖలపై కొందరు స్వామీజీల వాదన మరోలా ఉంది. అసలు విఐపి సిఫారసు లేఖలనే రద్దు చేయాలని డిమాండ్ వినిపిస్తున్నారు.. శ్రీవారి దర్శనంలో అందరూ సమానులే అని ఏపీ సాధు పరిషత్ స్వామీజీలు పేర్కొంటున్నారు. ఇలా సిఫారసు లేఖల పై ఎవరి వాదన ఎవరిది కాగా, తిరుమలలో సిఫారసు లేఖలే కొందరు దళారీలకు పెట్టుబడిగా మారిపోయింది. దీంతో సిఫారసు లేఖల వ్యవహారం పై ఏపీ సర్కార్ నిర్ణయం ఏంటి, కొత్త పాలక మండలి ఈ సమస్యను ఎలా ఎదుర్కోబోతోందన్నదే సవాలుగా మారబోతోంది.

డెటాల్.ఇండియా హ్యాండ్ వాష్ కార్యక్రమం

టీ మీడియా, నవంబర్ 1, పెద్ద దోర్నాల: పెద్ద దోర్నాల మండలంలోని విద్యా వనరుల కేంద్రం నందు డెటాల్ ఇండియా హ్యాండ్ వాష్ వారి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలకు డెటాల్ సోప్స్ ఉచితంగా పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి బి. మస్తాన్ నాయక్. మాట్లాడుతూ ..విద్యార్థులు ప్రతిరోజు వారి చేతులను పరిశుభ్రంగా వినియోగించాలని తెలిపారు.

మండల విద్యాశాఖ అధికారి . ఎం.కొండలరావు. మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడానికి డెటాల్ వారు పాఠశాలలను ఎంపిక చేసుకొని వారి పాఠశాలలో డెటాల్ కిట్లు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బి. మస్తాన్ నాయక్ . ఎం. కొండల రావు . మరియు డెటాల్ ఏరియా కోఆర్డినేటర్ టి .లక్ష్మి . పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సి ఆర్ ఎం. టి . లు. కే .సాయికుమార్ పాల్గొనడం జరిగింది.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

టీ మీడియా. నవంబర్ 1. దేవరకద్ర :దేవరకద్ర నియోజకవర్గ మార్కెట్ యార్డ్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయని, ఈ సీజన్ నుండే సన్న వడ్లకు రూ.

500 బోనస్ ఇస్తామని, ఏ వన్ గ్రేడ్ క్వింటాలుకు రూ. 2320, సన్న వడ్లకు రూ. 2820 మద్దతు ధర గా ఉంటుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని అన్నారు. నాడు ప్రతిపక్షంలో కల్లాలకు కాంగ్రెస్ పేరుతో రైతుల కష్టాలను స్వయంగా చూసి, రైతులెవరు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుండి తాలు, తరుగు పేరిట 5 నుండి 6 కిలోల ధాన్యాన్ని రైతుల నుండి దోచుకునేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రైతుల బాధలు తెలిసిన ప్రభుత్వమని తెలిపారు, గతంలో మాదిరిగా తాలు పేరుతో ధాన్యంలో కోతలు పెట్టొద్దని హెచ్చరించారు, ధాన్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, గన్ని బ్యాగులు అవసరం ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను కోరారు, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సహాయం

టీ మీడియా, నవంబర్ 01, రామకృష్ణాపూర్ :క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ కు చెందిన సీనియర్ పాత్రికేయులు పూర్ణా పూర్ణానంద్ కుమార్ సింగ్ గత నెలలో అనారోగ్యం కారణంతో మృతి చెందడం జరిగింది. తనతో చదువుకున్న ఆర్కేపి సింగరేణి హై స్కూల్ 1991-92 లో పదవ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుకున్న స్నేహితులు అందరూ కలిసి కుమార్ సింగ్ కూతురు,కొడుకు చదువుల కోసం ఆర్థిక సహాయంగా ఒక లక్ష నలబై వేల రూపాయలు శుక్రవారం గురుదాస్,భాస్కర్ ల చేతులమీదుగా అందించడం జరిగింది.

బీసీ కమిషన్ పై పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు

టీ మీడియా, నవంబర్ 1,కరీంనగర్ : కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కరీంనగర్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణకు రాలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. కమిషన్ మీద కాంగ్రెస్ నేతలకు నమ్మకం లేదు. అందుకే విచారణకు ఎవరూ రాలేదన్నారు. బహిరంగ విచారణలో ఆయనతో పాటు బీఆర్ఎస్ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. "బీసీ కమిషన్‌కు విలువ లేదని హైకోర్టు చెప్పింది. కానీ, దాని మీద ఉన్న గౌరవంతో ఇక్కడికి వచ్చాం. కానీ మాకు మాట్లాడటానికి సమయం కూడా ఇవ్వలేదు. బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా తయారైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్‌ను కోరాం. బీఆర్ఎస్ తప్ప ఇతర పార్టీల నుంచి ఎవరూ రాలేదు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎందుకు రాలేదు? కొత్త కమిషన్ వేయాలని కోర్టు చెప్పిన తర్వాత అభిప్రాయ సేకరణ ఎందుకు?" అని ప్రశ్నించారు.

స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలి

- మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత

టీ మీడియా, నవంబర్ 1,హుస్నాబాద్: ప్రజలందరూ పట్టణాన్ని స్వచ్ఛత లో ముందు ఉండి పట్టణాన్ని స్వచ్ హుస్నాబాద్ గా తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషించాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో 20 వ వార్డ్ ప్రజల భాగస్వామ్యం తో స్వచ్ దీవాలి శుభ్ దీవాలి కార్యక్రమం నిర్వహించారు. రైతు బజార్, శివాజీ నగర్ ఏరియా లో రోడ్డు మీద బాణసంచా కి సంబంధించిన చెత్తను(హానికరమైన చెత్త) ను తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలు అందరూ కూడా గత ఏడాది కంటే ఈ సంవత్సరం బాణసంచా తక్కువగా కాల్చారని, పర్యావరణాన్ని రక్షించేందుకు తమ వంతు కృషి చేశారని చెప్పారు. పర్యావరణాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్న ప్రజలందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనిత రెడ్డి,కౌన్సిలర్ వాల్ల సుప్రజ, కో ఆప్షన్ మెంబర్ లు శంకర్ రెడ్డి, ఆయుబ్ , మాధవ రెడ్డి, కొమురవెల్లి రవీందర్, సుధాకర్ రెడ్డి, పర్యావరణ అధికారి రవికుమార్, జవాన్ లు సారయ్య, ప్రభాకర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్రమంతటా పాదయాత్ర చేస్తా

-త్వరలోనే తేదీలను ప్రకటిస్తా

ట్విట్టర్ వేదికగా కెటిఆర్

టి మీడియా, నవంబరు 1,హైదరాబాద్ :పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేస్తానని ప్రకటించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టేందుకు ఈ యాత్ర చేపడతానని చెప్పారు.. పార్టీ అధ్యక్షుడు కెసిఆర్, ఇతర ముఖ్య నాయకులతో చర్చించిన అనంతరం యాత్ర తేదీలను ప్రకటిస్తానని వెల్లడించారు.. ట్విట్టర్ ద్వారా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో, ప్రజలతో దీపావళి రోజున రాత్రి సమయంలో లైవ్ ద్వారా మాట్లాడిన కెటిఆర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ తరుణంలో తెలంగాణ ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమ పార్టీపై ఉందని అన్నారు.. న్యాయం చేయాలని కోరుతున్న పార్టీ నేతలపై వేధింపులు, అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు..అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న పోలీసులపై తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపంగా మారిందని, కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రం ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్లుగా తయారైందని విమర్శించారు.. కాంగ్రెస్ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమైన స్థితికి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు..

నిరుపయోగంగా ఉన్న నీటి పంప్ హౌస్ రూమ్

-వెంటనే తొలగించాలి : గజరాజుల తిరుమలేష్

టీ మీడియా, నవంబర్ 1, వనపర్తి బ్యూరో : వనపర్తి పట్టణంలోని 24వ వార్డులో గత కొన్నేళ్లుగా బండారు బావి త్రాగునీరు దాహం తీర్చిన వనపర్తి ప్రజలకు, ప్రస్తుతం వాటిని వాడుకంలో లేనందు వల్ల పూడ్చి వేయడం జరిగింది. దాని పక్కన ఉన్న పంప్ హౌస్ రూమ్ నిరుపయోగంగా ఉండడం చేత దాన్ని చుట్టుపక్కల చెత్తా చెదారం, పందుల బెడద పారిశుద్ధ్యం లోపించడం వల్ల క్రిమి కీటకాల సీజనల్ వ్యాధులతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు మారిన సమస్య మాత్రం ఇప్పటికి మారడం లేదు. అదే విధంగా అర్ధరాత్రి అయితే క్షుద్ర పూజలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కావున వెంటనే ఈ పంప్ హౌస్ రూమ్ తొలగించాలని స్థానిక ప్రజలు, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర సాగర్, యువమోర్చా నాయకులు తేజ, వంశీ కృష్ణ, స్థానిక యూత్ సభ్యులు సంతోష్, మనోహర్, అభి, చింటూ, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగుట్ల మనమే తోపు

- ఏపీ రెండో స్థానంలో

టి మీడియా, నవంబరు 1,హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్రం మద్యం అమ్మకాల్లో టాప్ ప్లేస్‌లో నిలిచింది. సౌత్ ఇండియాలోనే లిక్కర్ సేల్స్‌లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఏపీ రెండో స్థానంలో ఉంది. తెలంగాణలో గత ఏడాది సగటున ఒక్కొక్కరు రూ.1,623 మద్యం కోసం ఖర్చు చేయగా ఏపీలో రూ.1,306 ఖర్చు చేసినట్లు ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) వెల్లడించింది. పంజాబ్‌లో రూ.1,245, ఛత్తీస్‌గఢ్‌లో రూ.1,227 చొప్పున ఒక్కో వ్యక్తి ఖర్చు చేస్తున్నట్లు పేర్కొంది. పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో మద్యంపై తక్కువ ఖర్చు చేస్తున్నట్లు అంచనా వేసింది. తెలంగాణలో 2,620 మద్యం దుకాణాలు, వెయ్యికిపైగా బార్లు, పబ్స్ ఉన్నాయి. దసరాకు దాదాపు రూ.1,000 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలుస్తుంది. 11 లక్షల కేసుల మద్యం, 18 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగినట్లు తెలుస్తుంది. సౌత్ ఇండియాలోని తెలంగాణ రాష్ట్రంలో బీర్ల ఎక్కువ కొనుగోలు అవుతున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య బీర్లుకు రూ.302.84 లక్షలు ఖర్చు చేసినట్లు అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 169 బీర్ల అమ్మకాలు జరిగాయి. తెలంగాణలో మద్యం అమ్మకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వాన్నికి భారీ ఆమ్దాని వస్తుంది.

జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీలకు...

గోర్కీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎంపిక

టి మీడియా, నవంబరు 1,ఖమ్మం : త్వరలో జరగనున్న ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీలకు మా పాఠశాల విద్యార్థి వంగూరి వినయ్ వర్మ ఎంపికైనాడని యాజమాన్యం తెలిపింది. వినయ్ ఇటీవల పెద్దపల్లి నెహ్రూ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనాడని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మా పాఠశాల విద్యార్థి వంగూరి వినయ్‌ని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి. గోర్కి, ప్రిన్సిపాల్ ఎంపి రాజన్, పిఇటిలు విజయ్, శ్రీనివాస్ మరియు పలువురు అధ్యాపకులు అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

నే టి నుండీ కార్తీక మాసం

టీ మీడియా, నవంబర్ 1 , ఢిల్లీ: ఈ నెల 02 స్థిరవారం నుండి కార్తీక మాసం మొదలవుతోంది. 03 ఆదివారం యమవిదియ. భగినీహస్త భోజనం. 04 మొదటి కార్తీక సోమవారం. 05, మంగళవారం. నాగుల చవితి. 11 రెండవ కార్తీక సోమవారం. 12 మంగళవారం ఏకాదశి. 13 బుధవారం క్షీరాబ్ధి ద్వాదశి దీపాలు. 15 శుక్రవారం కార్తీకపూర్ణిమ. 18 కార్తీకమాసం మూడో సోమవారం. 25 కార్తీకమాసం నాలుగో సోమవారం. 26 కార్తీక బహుళ ఏకాదశి. 29 కార్తీక మాసం మాస శివరాత్రి. 1, ఆదివారం కార్తీక అమావాస్య. డిసెంబర్ 2 సోమవారం మార్గశిర శుద్ధ పాడ్యమి పోలి స్వర్గం. ఈ ఏడాది నవంబరు 02 స్థిరవారం నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుంది డిసెంబరు 02, సోమవారం పోలిస్వర్గంతో కార్తీకమాస దీక్ష పూర్తవుతుంది.

హార్టికల్చర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ గా -ప్రొఫెసర్ రాజిరెడ్డి

టీ మీడియా, నవంబర్ 1, వనపర్తి బ్యూరో : హార్టికల్చర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ గా నూతనంగా నియమితులైన ప్రొఫెసర్ రాజిరెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన ఈ భేటీ సందర్భంగా ప్రొఫెసర్ రాజిరెడ్డి ని శాలువాతో సన్మానించి చిన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మా గ్రామానికి మద్యం షాప్ వద్దు

-ఆందోళన చేసినమహిళలు.

టీ మీడియా, నవంబర్ 1 ,పెద్దదోర్నాల :దోర్నాల మండలంలోని ఆందోళన చేసిన అయిన ముక్కల మహిళలు. గ్రామస్తులు. సాయంత్రం అయిన ముక్కలగ్రామానికి చెందిన గ్రామస్తులు . మహిళలు. కర్నూల్. గుంటూరు. రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కర్నూల్. గుంటూరు . ఇరువైపుల వాహనాలు విషయం తెలుసుకున్న ఎస్ఐ.వి. మహేష్. వచ్చి ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బంది కలిగించకండి. అన్నారు. ఆ గ్రామస్తులు మాట్లాడుతూ. మా గ్రామానికి మద్యం షాప్ వద్దు అంటూ నిర్వహించారు. మేమంతా పేదవాళ్ళం. ప్రతిదానికి అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా గ్రామంలోకి వెళ్లి రావాలి. గ్రామం దగ్గర దోవలో మద్యం షాపు పెడితే ఆడవాళ్ళం తిరగటం ఇబ్బంది అవుతుంది. అందువలన మద్యం షాపు ఇక్కడ పెట్టడానికి మేము అంగీకరించం అంటూ అయిన ముక్కల గ్రామానికి చెందిన మహిళలు. గ్రామ ప్రజలు. శుక్రవారం ఆందోళన చేశారు. రోడ్డుకు అడ్డంగా కూర్చుని వాహనాలను నిలిపివేశారు. చివరకు ఎస్ఐ. వి. మహేష్. పోలీస్ లు . వచ్చి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపులను కేటాయించడంతో ఈ మద్యం షాపును గ్రామం వెళ్లే ఒక ప్రైవేట్ స్థలంలో గ్రామం దగ్గర మధ్యలో షాపు ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు సంబంధించి గ్రామం పక్కనే షాపు నిర్మాణం కోసం మట్టి తోలినారు. . ఇది గమనించిన మహిళలు ప్రజలుతామంతా పేదవాళ్లమని, ప్రతిదానికి గ్రామంలోకి వెళ్లి రావాల్సి వస్తుందని చెప్పారు. వివిధ రకాల పనుల కోసం వెళ్లే మహిళలు రాత్రిపూట రావాలంటే భయంగా ఉంటుందని, మద్యం షాపు పెడితే తమకు మద్యం సేవించిన వారి ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ల అందజేత

పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్ లను

భాదితులకు అందచేసిన ముదిగొండ పోలీసులు

టి మీడియా, నవంబరు 1,ముదిగొండ : ముదిగొండ మండలంలో మేడేపల్లి కి చెందిన పగిల్ల భూలక్ష్మి, ముదిగొండకు చెందిన దోమల జగదీశ్ మరియు అద్దంకి రమేష్ లు వారియొక్క మొబైల్ ఫోన్ లను వివిధ ప్రదేశాలలో పోగొట్టుకోగా వాటిని సీఈఐఆర్ వెబ్ సైట్ నందు అప్లోడ్ చేసి, సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా మొబైల్ ఫోన్ లు ఆచూకి కనుగొని అవి వాడుతున్న వారి దగ్గరనుండి సెల్ ఫోన్ లను రికవరీ చేసి సెల్ ఫోన్ లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు శనివారం ముదిగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ ఓ.మురళి, ఎస్ఐ నరేష్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారి మొబైల్ ఫోన్ లను అందచేసారు.. ఈ సందర్భంగా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ముదిగొండ పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈసీపై లేఖాస్త్రం

-తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్

టీ మీడియా, నవంబర్ 1 , ఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. తన స్వతంత్రతను పూర్తిగా పక్కనపెట్టడమే లక్ష్యమైతే.. ఆ విషయంలో ఎన్నికల సంఘం అద్భుతమైన పనితీరు చూపుతోందని ఆ పార్టీ ఈసీపై మండిపడింది. ఈ మేరకు లేఖ రాసింది. ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు చేస్తూ ఫలితాలు వెలువడ్డాయి. బీజేపీ అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది.

ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా.."తమకు అనుకూల ఫలితాలు రానప్పుడు కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తుంటుంది" అని ఎదురు విమర్శించింది. ఆ ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని ఈసీ తోసిపుచ్చింది. హర్యానా ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదని, ఇలాంటి పనికిమాలిన ఫిర్యాదులు చేసే ధోరణిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎన్నికల సంఘం తనకు తాను క్లీన్‌చిట్ ఇచ్చుకోవడం తమనేమీ ఆశ్చర్యపర్చలేదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. అయితే సమాధానం ఇచ్చిన తీరు, వాడిన భాష, పార్టీపై చేసిన ఆరోపణలు తాము తిరిగి లేఖ రాసేందుకు కారణమయ్యాయని వ్యాఖ్యానించింది. ఈసీ ఇదే తరహా భాషను ఉపయోగిస్తూ ఉంటే.. అలాంటి వ్యాఖ్యలను తొలగించేందుకు న్యాయపరమైన ఆశ్రయం పొందడం మినహా తమకు మరో మార్గం లేదంటూ ఆ లేఖలో తీవ్రంగా స్పందించింది.